


(ప్రాచీన సాహిత్యంలో పకపకలు)

ఆ అబ్బాయికి ఇరవై ఏళ్ళయినా ఉంటాయో లేదో. కండలు తిరిగిన శరీరం. కసరత్తు చేస్తాడు కాబోలు!

పై కప్పుకున్న ఉత్తరీయం ఆ శరీర సౌష్ఠవాన్ని మొయ్యగలదా! వాని మొహం

దబ్బపండులాంటి దేహచ్ఛాయ చూడరామా! రంగు కేమిలే! కనుముక్కుతీరు ఏమిముచ్చటగా వుంది!

చేతిలో తాటాకుల కట్ట పటుకుని రోజూ సాయంకాలం వేళ ఎక్కడినుంచి వస్తూ వుంటాడో

ఏలేశ్వరోపాధ్యాయులవారి గురుకులం నుంచే అయి వుంటుంది. ఇటువంటివాడికి గురుత్వం వహించగల సత్తా వారికి కాక మరో వాజమ్మకేముంటుంది!

చెప్పొద్దూ ఈ అబ్బాయి అందమంతా ఆ చారెడేసి కళ్ళల్లోనే వుంది సుమా! ఆ కళ్ళు అర్ధ నిమీలితంగా వుంటా యెందుకు? ప్రాక్తన జన్మ విద్యలు గుర్తుకు తెచ్చుకుంటున్నాడా?

ఒక్కసారైనా ఇటువైపు తిరిగి చూడదేమిటో?

సిగ్గా?

పరాయి ఇంటి కోడలిని కన్నెత్తి చూడకూడదని నియమమా

నేను అందంగా లేనా?

లేక, అతగాడిలో ఇంకా మన్మథోద్దీపనం మొదలేకాలేదా? మరీ అంత పసిపాపకాదే!

ఆ వీధిలో అదొక్కటే పెంకుటిల్లు. ఏనుగు తొండాల గుమ్మాలు.

పసుపురాసిన ద్వారబంధానికి ఆనుకుని ఆ పడుచు అతడా దారిని వెళ్ళేవేళకి వచ్చి నిలుచుంటుంది. రోజుకో రకంగా అలంకరించుకుంటుంది.

ఇంట్లో అత్తగారు అనే పదార్థం వుంది గానీ, ఆమెకి కళ్ళు కనిపించవు. చెవులు మాత్రం పాముజాతివి. చీమచిటుక్కుమంటేచాలు "ఎవరే వారూ?" అంటుంది.

మొగుడు ఏదో వ్యాపారం వెలిగిస్తానని పరదేశం వెళ్ళి ఏడు నెలలైంది మొన్న శ్రావణ మాసానికి. వెళ్ళేకకబురే లేదు.

ఆకాశంలో ధుమధుమలాడుతూ ఉరుములు.

వసారాలో ధుమధుమ లాడుతూ అత్త

**డాక్టర్**
**మహీధర నళినీమోహన్**

గారు.

అద్దంమీద టక్కు టక్కు పొడుస్తూ పిచికలు.

ఇంత ఇంట్లోనూ బిక్కు బిక్కుమంటూ తాను.

ఈ రోజు ఆ అబ్బాయిని పలకరించి తీరాలి. ఇంక జాప్యం పనికిరాదు

ఎవరేనా చూస్తారేమో! చూస్తే చూడనీ

అత్త వింటుందేమో! వింటే విననీ.

ఆ అబ్బాయి తనని గురించి ఏమైనా అనుకుంటాడేమో? ఏమనుకుంటాడేం? అందానికి తగ్గ చురుకైన పాదరసంలాంటి బుద్ధి కూడా వుంటే తన ఉద్దేశం గ్రహించకపోడు. లేదూ? అతని ఖర్మ.

గొంతు సవరించుకుని, షడ్జమంలో ఇల్లా అంది:

శ్లో॥ వసంత తిలక :-

"భోపాంథ! పుస్తకధర! క్షణమత్ర తిష్ఠ!
వైద్యోఽసికిం? గణితశాస్త్ర విశారదోవా?
కే నౌషధేన మమ పశ్యతి భర్తురంబా?
కిం వాగ మిష్యతి పతిః పరదేశవాసీ?"

చేతిలో ఏదో పుస్తకం పుట్టుకుని వెడుతున్న బాటసారీ! ఒక్కక్షణం ఆగు.

నువ్వు చదువుకుంటున్నది వైద్యమా? జ్యోతిషమా?

అది వైద్యమే అయితే మా అత్తగారికి ఏ మందు వేస్తే కంటి చూపు వస్తుందో చెబుదూ!

లేక జ్యోతిశ్శాస్త్రం చదువుకుంటున్నట్లయితే దేశాంతరం వెళ్ళిన నా భర్త ఎప్పుడు తిరిగి వస్తారో గ్రహచారం లెక్క కట్టి చెబుదూ!

ఆ అబ్బాయి తలెత్తి ఆమెకేసి తేరిపార చూశాడు.

చంద్రోదయవేళ నల్లకలవల జంట విచుకున్నట్లైంది.

ఆ ఇంట్లో ఆ పిల్లా, ఆమె అత్తగారూ మాత్రమే వుంటున్నారనీ, అత్తగుడ్డిది అనీ. ఆమె భర్త చాలాకాం కిందటే పరదేశం వెళ్ళి. ఇంకా తిరిగిరాలేదనీ, ఆ అబ్బాయికి అర్థం అయిందా?

వైద్యుడుగా గానీ జ్యోతిష్కుడిగా గానీ అపరిచితమైనప్పటికీ తనకి ఆ ఇంట్లోకి వెళ్ళే అవకాశం వున్నదనీ, ఎవ్వరూ తప్పు పట్టడానికి ఆస్కారం లేదనీ ఆ అబ్బాయి తెలుసుకోగలిగేడా?

సున్నితమైన ఆ అమ్మాయి చెయ్యి పట్టుకుని, తన సాముద్రిక పాండిత్యాన్ని ప్రదర్శించే అవకాశం వచ్చిందని అతడు గ్రహించగలిగేడా? ఆ పిల్లకిఉన్న గడుసుతనం అతడికి ఉందా?

లేక. "నేను వైద్యుణ్ణీ కాను. జ్యోతిష్కుణ్ణీ కానమ్మోయ్. నిన్నటి పాఠాలు వల్లించుకోవాలి. ఆగడానికి వ్యవధిలేదు" అని తల ఎగరేసుకుంటూ, పెద్ద పెద్ద అంగలతో ఎదరకి వెళ్ళిపోయాడా?

తరువాత ఏమైందో తెలియదగ్గ చారిత్రకాధారాలు ఏవీలేవు మనదగ్గర.